# కొత్త చిగురు

వేములపల్లి రాధిక

సీరియస్‌గా సాగుతున్న క్లాస్‌కు డ్రాయింగ్ మాస్టారి రాకతో బ్రేక్ పడింది. సైన్సు లెసన్ చెప్తున్న సుప్రియ మేడమ్ పాఠం ఆపి డ్రాయింగ్ మాస్టారి వైపు ప్రశ్నార్థకంగా చూసింది. తన వెంట వచ్చిన పాపను, చేతిలో వున్న పేపర్లను మాడమ్‌కు అప్పజెప్పి ''ప్రిన్సిపల్‌గారు మిమ్మల్ని ఈ పాపకు సెకండ్ క్లాస్ ఎంట్రన్స్ టెస్ట్ కండక్ట్ చేయమన్నారు'' అని చెప్పాడు డ్రాయింగ్ టీచర్ రాజేష్.



''నేను క్లాసులో వున్నానని ప్రిన్సిపల్‌గారికి చెప్పండి, వేరెవ్వరికైనా అప్పజెప్తారు'' అంది సుప్రియ.

''సరే''నంటూ ఆ పాపను వెంటబెట్టుకు వెళ్లిన రాజేష్ పది నిమిషాల్లో గోడకు కొట్టిన బంతిలా తిరిగి వచ్చాడు. ప్రిన్సిపల్‌గారు మిమ్మల్నే కండక్ట్ చెయ్యమని చెప్పారు అంటూ. రాజేష్ ఇచ్చిన పేపర్స్ చేతిలోకి తీసుకుంది సుప్రియ.

వెనక్కి తిరిగి వెళ్తున్న వాడల్లామళ్లీ క్లాస్‌లోకి వచ్చాడు రాజేష్. ''మేడమ్! మీరు స్ట్రిక్ట్‌గా వుంటారని తెలుసు. కానీ మన ఆఫీసు మేనేజర్ జోషి గారు ఈ అమ్మాయికి ఎలాగైనా సరే ఎంట్రన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అవడమే కాకుండా మంచి మార్కులు వచ్చేటట్లు చూడమన్నారు'' అన్నాడు రాజేష్.

''రాజేష్ గారూ! ఒక పని చెయ్యండి. ఈ పేపర్స్‌ని, ఈ అమ్మాయిని మీరే తీసుకు వెళ్లి ఆఫీసులో కూచోబెట్టుకుని మీకిష్టమైన విధంగా రాయించుకోండి. కనీసం నాకు ఈ బాధైనా తప్పుతుంది'' కఠినంగా అంది సుప్రియ. అంతే! వెంటనే ఆ క్లాస్‌లో నుండి మాయమయ్యాడు రాజేష్.

సాలోచనగా పేపర్స్ పట్టుకున్న సుప్రియ క్లాస్ వైపు చూసింది. వాళ్లు మరీ చిన్న పిల్లలేం కాదు. ఇంగ్లీషు మీడియం స్కూల్లో సెవెన్త్ క్లాస్ అంటే కనీసం పన్నెండు సంవత్సరాలైనా వుంటాయి. వాళ్లకి తమ మాటల ద్వారా అర్థమయ్యే వుంటుంది. ఎంత దిగజారి పోతున్నాం, పాఠాలు చెప్పే ఉపాధ్యాయులుగా తామె సరిగా పాటించలేనప్పుడు విలువల గురించి పిల్లలకేమి చెప్తాము అనుకొంది మనసులో బాధగా.

క్లాసులో పిల్లలంతా సుప్రియకేసి ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పుడు తమ టీచర్ ఏం చేస్తోందోనని. ఆ పాపకు సాయం చేసి ఎంట్రన్స్ పరీక్ష గండం గట్టెక్కిస్తుందా లేక తన సిన్సియారిటీ నిరూపించుకుంటుందా అని. పిల్లల్లో ఒకరినడిగి రైటింగ్ పాడ్ తీసుకొని తన పక్కనే అప్పటి వరకూ మౌనంగా నిలుచున్న ఆ అమ్మాయికి ఇస్తూ ''నీ పేరేమిటి?'' అని అడిగింది సుప్రియ.

'లాస్య' అని సమాధానమిచ్చి టీచర్ చూపించిన బెంచి పైన కూర్చుని తనకిచ్చిన ఎంట్రన్స్ టెస్ట్ పేపర్‌లో సమాధానాలు రాయడంలో మునిగిపోయింది లాస్య. తిరిగి తను అంతకుముందు చెబుతున్న పాఠాన్ని కొనసాగించింది సుప్రియ.

ఇంతలో తలుపు దగ్గరకొచ్చి నుంచున్నాడు సోషల్ మాస్టారు ఉదయ్. లోపలికి రాబోతూ 'మేడమ్! ఎలా రాస్తోంది ఆ అమ్మాయి?'' అని అడిగాడు ఉదయ్. తనే ముందుకు కదిలి వెళ్తూ ''తను స్వంతంగా రాసుకుంటుంది మీరు డిస్టబ్ చేయకండి'' అంటూ ఉదయ్‌ని ఆపింది సుప్రియ. ''అది కాదు మేడమ్! ఆ అమ్మాయి ఎవరో తెలుసా? మన ఊరిలో వున్న ఇంజ

నీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేయడానికి విదేశాల నుండి తిరిగి వచ్చిన ఎన్నారై దంపతుల కుమార్తె. వాళ్లేమో మన ఊరిలో మన ఊరిలో పేరు ప్రఖ్యాతులున్న వాళ్లు. వాళ్ల అమ్మాయి మంచి మార్కులతో క్వాలిఫై కాపోతే వాళ్ల స్టేటస్‌కు తగినట్లు వుండదు. ప్రిన్సిపల్‌గారు మిమ్మల్ని పరీక్ష నిర్వహించ మనగానే ఆఫీస్ మేనేజర్ జోషిగారు జుట్టుపీక్కొంటున్నారు. మీరేమో మాల్ ప్రాక్టీస్ ఒప్పుకోరు. ఆ పిల్లేమో ఎట్టి పరిస్థితిలోనూ మంచి మార్కులతో క్వాలిఫై కావాలి. ఏంచెయ్యాలో తోచక జోషిగారు మీతో చెప్పి రమ్మని నన్ను పంపారు. ఇంతకు ముందు కూడా మీరు టెస్ట్ కండక్ట్ చేస్తే ఇద్దరు ముగ్గురు పలుకుబడి వున్న వాళ్ల పిల్లలకి సరైన మార్కులు రాలేదని జోషిగారు కంగారు పడుతున్నారు'' అన్నాడు ఉదయ్.


వెంటనే రియాక్ట్ అవుతూ అంది సుప్రియ. ''టెస్ట్ సిన్సియర్‌గా జరిపించాలనే ఉద్దేశ్యంతో ప్రిన్సిపల్ గారు నా దగ్గరకు పంపారు. ఆ అమ్మాయి ఎలా రాస్తే అలానే దిద్దుతాను. మళ్లీ మళ్లీ వచ్చి నన్ను విసిగిస్తే ఈ విషయం ప్రిన్సిపల్‌తో చెప్పాల్సి వుంటుంది. అయినా ఇలా మాట్లాడటానికి మీకేమీ అనిపించడం లేదా? లోకం తెలియని చిన్నారులకు టీచర్లుగా మనం నేర్పాల్సింది చదువుతో పాటు విలువలు కూడా. కానీ ఇప్పుడు జరిగే ఈ తతంగమంతా పిల్లలు గమనిస్తున్నారు వారి దృష్టిలో టీచర్లంటే గౌరవం ఇంకేముంటుంది? ఇంకెప్పుడూ నా దగ్గరకు ఇలాంటి వార్తలు తీసుకురావద్దు''

ఆ వాగ్ధాటికి తట్టుకోలేక పలాయనం చిత్తగించాడు ఉదయ్. ఈ గొడవ వల్ల ఇక పాఠం చెప్పే మూడ్ లేక కూర్చుండిపోయింది సుప్రియ. పిల్లలు కూడా పరిస్థితిలోని సీరియస్‌నెస్ గమనించి నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఎదురుగా కూర్చొన్న లాస్యవైపు చూపు తిప్పింది సుప్రియ. అప్పటివరకూ జరుగుతున్న తతంగంతో తనకేమీ సంబంధం లేనట్లుగా చకచకా కదులుతున్నాయి ఆ పిల్ల చేతివేళ్లు. చేతిలోని పెన్సిల్‌తో చాలా కాన్ఫిడెంట్‌గా ఆన్సర్లు రాస్తోంది. పరిశీలనగా లాస్యకేసి చూసింది సుప్రియ. చామన ఛాయతో బొద్దుగా, పెద్ద పెద్ద కళ్లతో ముద్దొస్తూ వుంది ఆ పాప. ఎలా రాస్తోందో చూద్దామని దగ్గరకు వెళ్లి పేపర్‌ను పరిశీలించి ఆశ్చర్యపోయింది సుప్రియ. రాజేష్, ఉదయ్ చెప్పినట్లుగా ఒకళ్లు సాయం చేయాల్సిన స్థితిలో లేదు. లాస్య రాసిన ప్రతి జవాబూ కరెక్టే. కానీ అన్నింటికీ జవాబులు రాయలేదు. ఎందుకని సుప్రియ అడిగితే అవి నాకు రావు అంది లాస్య.

ఇంతలో బెల్ మోగడంతో తనకు తరవాత పిరియడ్ కావడంతో లాస్యను వెంటబెట్టుకొని స్టాఫ్‌రూమ్‌కు వెళ్లింది సుప్రియ. ''ఏంటి సుప్రియా! ఇంత ధైర్యంగా మాకు చెప్పకుండా ఇంత క్యూట్‌గా వున్న అమ్మాయినెప్పుడు కన్నావ్?'' అంటూ జోక్‌చేస్తున్న కొలీగ్స్ మాటలకు నవ్వుకుంటూ సుప్రియ లాస్యను అక్కడ కూర్చోబెట్టింది టెస్ట్ పూర్తిచేయమని.

పేపర్లు దిద్దాక చూస్తే దాదాపు డెబ్భైశాతం మార్కులు వచ్చాయి. ఆ పిల్ల పెర్ఫార్మెన్స్‌కు 'టుబి ఎడ్మిటెడ్'' అని రాసి ప్రిన్సిపల్‌కు పేపర్లు అప్పగించి తనక్లాసుకు వెళ్లింది సుప్రియ. సుప్రియ ఇచ్చిన పేపర్లు టేబిల్‌పై వుంచి ప్రిన్సిపల్ కూడా క్లాస్‌కు వెళ్లారు. ఆయన రోజూ లంచ్‌టైమ్‌కు ముందు క్లాస్ తీసుకుని బెల్ కొట్టిన వెంటనే తిరిగి తన రూమ్‌కు రాకుండా ఇంటికి భోజనానికి వెళ్తారు. స్కూల్లో స్టాఫందరికీ తెలిసిన విష యమే అది.

లంచ్ బెల్ మోగగానే క్లాసు నుంచి బయటకు వచ్చిన సుప్రియ బిలబిలలాడుతూ పరుగులు తీసే



17 నుంచి 9
మధ్య చుక్కలు

మాధురీదేవి సానా
బెంగుళూరు

పిల్లల్ని తప్పించుకుంటూ డైనింగ్ హాల్ వైపు నడుస్తోంది. రోజూ ఉత్సాహంగా పడే అడుగులు ఈ రోజు చాలా నిదానంగా పడుతున్నాయి. మనస్సు నిండా ఆలోచనలు. ఏమో! తనే ఇక్కడా ఇమడలేక పోతోందేమో. సమాజంలో ఈ రోజున నిజాయితీగా వుండటం అనే విషయం విలువ లేనిదై పోతున్నదా? ఇందాక వాళ్లందరూ తనని ఎంత ఒత్తిడి చేశారు ఆ లాస్యకు జవాబులు చెప్పమని. తను మాత్రమే కాదు. తనలాంటి వాళ్లున్నారు. కానీ చాలా తక్కువ మంది మాత్రమే. ప్రిన్సిపల్ కూడా సిన్సియర్. అందుకే తనను కండక్ట్ చేయమన్నారు. కానీ ఈ ధోరణితో తనకు మేనేజ్‌మెంట్ నుండి ముప్పు తప్పదు. ఇవాళ కాకపోతే రేపైనా ఉద్యోగం ఊడక తప్పదు. ఇలా ఎన్నిచోట్ల మారాలో! ఎన్ని ఉద్యోగాలు మార్చాలో! అసలు పాఠశాలల్లో ఈ ధోర ణి ప్రబలడానికికారణం సమాజంలో చదువుపట్ల ఏర్పడిన తప్పుడు అవగాహనే. ఎన్ని మార్కులు వచ్చినా ఇంతేనా! మా అబ్బాయికి ఇంకా ఎక్కువ మార్కులు రావా అని అడిగే తల్లిదండ్రుల వత్తిడికి లొంగి మేనేజ్‌మెంట్ వారు కూడా తల్లిదండ్రులకు పిల్లలను గొప్పగా చూపెట్టడానికి, పిల్లల అసలు సామర్థ్యానికన్నా ఎక్కువమార్కులువేసి పిల్లల చదువును 'కొనే' ఆ తల్లిదండ్రులకు చూపడం సాధారణమైంది. ప్రతివాళ్లూ వాళ్ల పిల్లల స్థాయిని విస్మరించి వారుమంచి ర్యాంక్‌లో వుండాలని ఆశిస్తూ, అలా ర్యాంక్ రాని పక్షంలో స్కూల్ మార్చేస్తాం అనో టీచర్లు బాగా చెప్పడం లేదనో ఫలానా స్కూల్లో అయితే ఇంకా మంచి ర్యాంకు తెప్పిస్తారు అనో అనడంతో తల్లిదండ్రుల ఈ ధోరణికి తగ్గట్టు కొన్ని చోట్ల టీచర్లను కూడా లిబరల్‌గా పరీక్షలు నిర్వహించమని, పేపర్లు దిద్దమని మేనేజిమెంట్లు సూచిస్తున్నాయి. ఈ అనారోగ్యకర పోటీలో చిన్నారుల బంగారు భవిష్యత్తు బలి అవుతోంది.

ఆలోచనల్లో మునిగి డైనింగ్ హాల్ వైపు నడుస్తున్న సుప్రియ ప్రిన్సిపల్ రూమ్ దాటి వెళుతుండగా, అనుకోకుండా లోపలికి చూసింది. లోపల జోషి, ఉదయ్, రాజేష్ వున్నారు. పక్కనే లాస్య, ఆమె తల్లిదండ్రులు వున్నారు. వెంటనే సుప్రియ మనసులో అనుమానం ప్రవేశించింది. వాళ్లు ఏం చేస్తున్నారో చూద్దామని కిటికీ దగ్గర నుండి చూడసాగింది. జోషి ఇంతకుముందు తను రాయించిన టెస్ట్ పేపర్లు తీసి అందులో లాస్య చేత పెన్సిల్‌తో జవాబులు రాయించడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ లాస్య అందుకు ఒప్పుకోవడం లేదు. ''అంకుల్! నేను చెప్పాను కదా! నాకు మల్టిప్లికేషన్స్, డివిజన్స్ రావు అని, నాకు రాని లెక్కలు వచ్చినట్లుగా ఆన్సర్ చేయమంటారేమిటి? నేను చెయ్యను'' అంటోంది ఇంగ్లీషులో ధాటీగా.

అవాక్కయ్యాడు జోషి. లాస్య తన తల్లిదండ్రుల వైపు తిరిగి అంటోంది. ''మమ్మీ! ఇదేమిటి? రాని ప్రశ్నలకు వచ్చినట్లు వాళ్లు చెప్పిన ఆన్సర్స్ రాసి ఇంకా ఎక్కువ మార్కులు తెచ్చుకోమంటారేమిటి ఈ అంకుల్? ఐ హేట్ ఇట్ డాడ్! నేను ఇక్కడ చదువుకోను వెళ్లిపోదాం రండి!'

అంతే! అప్పటివరకూ జరుగుతున్నదంతా గమనిస్తున్న సుప్రియ పెదవులపై పూచిందొక చిరు దరహాసం. అది పెరిగి పెద్దదై నవ్వుతూ లోపలికెళ్లింది సుప్రియ. టీచర్ లోపలికి రావడంతో బిక్కమొహం వేసుకొని నుంచున్న లాస్యను ఎత్తుకొని బుగ్గలపై వెచ్చటి ముద్దిచ్చింది సుప్రియ. ''లాస్యా! నీకోసం వీళ్లందరి రికమండేషన్లు, తాపత్రయం చూసి నిన్ను తప్పుగా అంచనా వేశానమ్మా! బట్ యూ ఆర్ ఆన్ ద రైట్ ట్రాక్'' అంటూ లాస్యను దించి వెనుదిరిగిన సుప్రియకు గది గుమ్మంలో నుంచొని అభినందన పూర్వకంగా చూస్తున్న ప్రిన్సిపాల్ కనిపించారు. బయటకి వస్తుంటే సుప్రియకు అనిపించింది.''వర్తమానమే ఇంత ఘోరంగా వుంది. భవిష్యత్తు ఎలా వుంటుందోనని భయపడనక్కరలేదు. ఎప్పటికప్పుడు కొత్త చిగుర్లు, మొలకలు వస్తూనే వుంటాయి. తమను నేలలోనే అదిమిపెట్టే బండరాళ్లను పెకలించుకుంటూ. అవే రేపటి మహా వృక్షాలవుతాయి''

★